ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పగటిపూట చికిత్సలకే పరిమితం



- పిహెచ్‌సిలలో రాత్రి వేళ అందుబాటులో ఉండని వైద్యులు
- భద్రత లేక రాత్రి వేళ వైద్య సేవలకు స్టాఫ్ నర్సులు దూరం
- వాచ్‌మెన్‌ల ఏర్పాటును పట్టించుకోని ప్రభుత్వం
- పెద్దాసుపత్రులకే అత్యవసర కేసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి పూట వైద్య సేవలకు ప్రజలు దూరం అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో రాత్రి వేళ వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అత్యవసర చికిత్సలకు వెళితే సమీపంలోని పట్టణానికి లేదా గుంటూరు,నర్సరావుపేటలకు వెళ్లాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలో వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చామని ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామని నాలుగున్నర ఏళ్లలో 50 వేల మందికిపైగా వైద్యులు, అన్ని తరగతుల సిబ్బందిని నియమించామని చెబుతున్న ప్రభుత్వం పిహెచ్‌సిలల్లో రాత్రి వేళ వైద్య సేవలను పట్టించుకోవడం లేదు. 24 గంటలు వైద్య సేవలు అందించే పరిస్థితి లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పిహెచ్‌సిలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే వైద్యులు, సిబ్బంది ఉంటున్నారు. మొత్తం ముగ్గురు స్టాఫ్ నర్సులు 24 గంటల వైద్యచికిత్సల కోసం నియమించినా రాత్రి వేళ భద్రత లేక స్టాఫ్ నర్సులు ఉండటం లేదు. రాత్రి వేళ డ్యూటీలో ఉన్న వారు పిహెచ్‌సిలలో ఉండకుండా సంబంధిత గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని డ్యూటీ చేస్తున్నారు. అక్కడ కూడా చికిత్సలు నిర్వహించకుండా కేవలం వైద్య సలహాలు అందించి మందులు ఇచ్చి అత్యవసరం అయితే వెంటనే సమీపంలోని పట్టణానికి లేదా జనరల్ ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు. కొన్ని సందర్భాలలో స్థానికంగా వైద్యులు అందుబాటులో ఉంటే ప్రథమ చికిత్స చేయిస్తున్నారు. సాయంత్రం 4 గంటల తరువాత వైద్యులు, ఇతర సిబ్బంది ఉండకపోవడం వల్ల కేవలం ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే ఉండాల్సివస్తుంది. చాలా పిహెచ్‌సిలు ఊరికి దూరంగా ఉంటున్నాయి. రాత్రి వేళ జనసంచారం లేక ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలతో స్టాఫ్ నర్సులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చాలా మంది బిక్కుబిక్కు మంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇటీవల పల్నాడు జిల్లా కారంపూడిలో రాత్రి 10 గంటలకు డెలివరికీ వచ్చిన ఒక కుటుంబానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యారు. ఇక్కడ వైద్యులు లేరని స్టాఫ్ నర్సు వెంటనే గురజాలకు వెళ్లమని చెప్పగా అక్కడ వైద్యుడు గర్భిణీ పరిస్థితి బాగా లేదని నర్సరావుపేటకు వెళ్లమని చెప్పారు. భార్య, కుటుంబ సభ్యులను నర్సరావుపేటకు పంపి డబ్బుల కోసం తిరిగి కారంపూడి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో ఆ మహిళ భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాధ ఘటన చోటుచేసుకుంది. ఇలాగ రాత్రి వేళ చాలా పిహెచ్‌సిలలో వైద్యులు లేక

2లో



తుపాను ప్రభావంతో నీరు నిలిచి ఉరకెత్తిన మిర్చి పొలం

తుపానుతో మిర్చి రైతు కుదేలు

అతివృష్టి, అనావృష్టితో అగచాట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గత కొన్నేళ్లుగా మిర్చి పంటను తామర పురుగు, బొబ్బర తెగుళ్లు ఆశించి రైతులను నట్టేట ముంచాయి. మిచౌంగ్ తుపాను నేపథ్యంలో వీచిన ఈదురు గాలులకు నేల వాలిన మిర్చి మొక్కలను వ్యవసాయ కూలీలు సరి చేయడం కౌలు రైతులకు మరింత భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద, బ్యాంకులలో బంగారు ఆభరణాలు, భూములు తనఖా పెట్టి తీసుకువచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే తుపానుతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మొక్క నాటిన దగ్గర నుండి నీటి ఎద్దడి నేపథ్యంలో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసి మొక్కలు బ్రతికించామని తెగుళ్లు, చీడ పీడల నివారణకు లక్షల రూపాయల

2లో



'ఎకరాకు 25 వేలు కౌలు చెల్లించి 4 ఎకరాలలో మిర్చి సాగు చేపట్టాను. వర్షాలు లేక నీళ్లు కొని మొక్కలకు పెట్టుకున్నాను. తెగుళ్లకు, పురుగుమందులకు రూ.20వేలు ఎకరాకు అయ్యాయి. తుపానుతో మిర్చి మొక్కలు నేలవాలాయి.కూలీ ఖర్చులు తడిచి మోపెడవుతున్నాయి'.

కందుకూరి మోషే, కౌలురైతు, పెట్లూరివారిపాలెం



'మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. నీళ్లు లేక 1.5కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓగేరు వాగు నుండి పైపు ఏర్పాటు చేసి మొక్కలు తడుపుకున్నాను. ఇప్పుడు తుపాను నిలువునా ముంచింది. లోతట్టు భూమి కావడంతో మొక్క నేలవాలి ఎర్రబారింది.చేతికి వచ్చే పరిస్థితి కానరావడం లేదు.'

తాతబోయిన వీరాంజనేయులు, కౌలురైతు,అన్నవరం



అలరించిన ఘంటసాల సంగీత విభావరి

సినీనటి సుధ, పలువురుకళాకారులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఘంటసాల ఆలపించిన గేయాలతో స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం లో ఆదివారం జరిగిన సంగీత విభావరి ఆహుతులను అలరించింది. కళాదర్బార్ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఆళ్ళ దశరథ రామి రెడ్డి స్మారక ప్రతిభా పురస్కార సభ ఘనంగా జరిగింది. కళాదర్బార్ అధ్యక్షులు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి నిర్వహించి ఘంటసాల గేయాలను ఆలపించారు. ముఖ్య అతిధిగా రాజ్య సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలు చంద్రతేజ, ప్రవీణ్కుమార్, చాట్రగడ్డ శ్రీనివాసుడు, సత్యానంద్ , శైలజ, మాధవి, ఇందు నైనాలకు అతిధులు సంస్థ వారు స్మారక ప్రతిభా పురస్కారాలను బహూకరించి ఘనంగా సత్కరించారు. మహానటి సావిత్రి పురస్కారాన్ని ప్రత్యేకంగా ఎంపికైన సినీనటి సుధకు అందించి ఘనంగా సత్కరించారు . సందర్భంగా జరిగిన సంగీత విభావరి లో గాయని గాయకులు హేమమాలిని,జ్యోతిర్మయి, వీరరాఘవరావు, సాంబశివరావు అనేక సినీ గీతాలతో అభిమానులను అలరించారు. మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరి తదితరులు ప్రసంగించారు.

నేటి నుండి మిషన్ ఇంద్ర ధనస్సు

డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ శ్రావణ్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నేటి నుండి 16వ తేదీ వరకూ మిషన్ ఇంద్ర దనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గర్భిణులు, 0-5 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లాలో 630 మంది గర్భిణులు, 0-1 సంవత్సరం పిల్లలు 959 మంది, 1-5 సంవత్సరాల పిల్లలు 652 మంది ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా సంచార జాతులు, దినసరి కార్మికులు, డ్రాపౌట్ పిల్లలు, లెఫ్ట్ అవుట్ పిల్లలందరికీ టీకాలు ఇవ్వటం జరుగుతుందన్నారు.

17న 'మూడు రాజధానుల' పై నిరసన

నాలుగేళ్లు నిండిన సందర్భంగా వర్సిటీ ఎదుట భారీ సభ

తుళ్లూరు సమావేశంలో రాజధాని రైతులు వెల్లడి

వార్త మెయిన్ పేజీలో



మాట్లాడుతున్న రాజశేఖర్

17న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు

సిఐటియు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పర్సా సత్యనారాయణ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 17న గుంటూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జల్లడ రాజశేఖర్ పిలుపు నిచ్చారు. ఆదివారం పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు జి.పవన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు కనీస హక్కులు కూడా లేకుండా చట్టాలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. విద్యుత్ చట్ట సవరణ తీసుకొచ్చి విద్యుత్తు రంగాన్ని పూర్తిగా ప్రవేట్ పరం చేసి ప్రజలపై భారాలు మోపటానికి, ఉద్యోగులకు అన్యాయం చేయటానికి సిద్ధమతుందన్నారు.కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ఈ విధానాలను ఎదుర్కొనటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సిఐటియు జిల్లా కోశాధికారి ఎం. సాంబశివరావు మాట్లాడుతూ బీజేపీ విధానాలను రాష్ట్రంలో ఉన్న ప్రధాన పార్టీలన్నీ ఆమోదిస్తూ, ప్రభుత్వ రంగ

2లో



నేల వాలిన మిరప మొక్కలను నిలబెడుతున్న కూలీలు

తుపానుతో మిర్చి రైతు కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టామని, తుపాను ప్రభావం మిరప తోటపై తీవ్రంగా పడిందని చెబుతున్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి..

కామినేని రామారావు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి

జిల్లా లో సాగు చేసిన 50157 హెక్టార్లలో మిర్చి 80 శాతం పైగా దెబ్బతింది. సాగు చేసిన రైతులలో 70 శాతం కౌలు రైతులు ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మిర్చి రైతులు ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉంది. ఆదుకొని పక్షంలో పెట్టిన పెట్టుబడులు అప్పుల తీరక తీర్చే మార్గం లేక రాబోయే రోజుల్లో రైతులు ఆత్మహత్యలకు దారి తీసే పరిస్థితులు ఉన్నాయి. వాస్తవంగా కౌలు రైతులలో ఏ రైతు ఎంత మేర నష్టపోయాడో అధికారులు బందంతో అంచనాలు తయారు చేసి నష్టపోయిన మొత్తాన్ని ప్రభుత్వం అందించాలి. కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తే కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులను సమీకరించి పోరాటం చేస్తాం.

పగటిపూట చికిత్సలకే పరిమితం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్సలు జరగడం లేదు. స్టాఫ్ నర్సు ఒక్కరే విధులు నిర్వహించలేకపోతున్నారని కనీసం రాత్రి వేళ వాచ్‌మెన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వాపోతున్నారు.

సమస్యలు ఉన్న మాట నిజమే...

పిహెచ్‌సిలలో సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారని ఆ తరువాత స్టాఫ్ నర్సు మాత్రమే ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు. సాయంత్రం తరువాత స్టాఫ్ నర్సులు ఉంటారని కొన్ని పిహెచ్‌సిలల్లో తమకు భద్రత లేని సిబ్బంది తమ దృష్టికి తీసుకువచ్చారని ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని ఆయన తెలిపారు. రాత్రి పూట స్టాఫ్ నర్సుకు భద్రతగా వాచ్‌మెన్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

17న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలను ప్రైవేటుపరం చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమల్ని సైతం ప్రైవేటుపరం చేస్తుంటే ఇక్కడున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎదుర్కొనకపోవటం దారుణమన్నారు.కార్మిక వర్గంపై ముప్పేట దాడి జరుగుతున్న నేపథ్యంలో వీటిని ఎదుర్కొనేందుకు సంఘటితమై తిప్పికొట్టటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.నాగబ్రహ్మాచారి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు, జిల్లా కోశాధికారి జి. రాంబాబు తదితరులు ప్రసంగించారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పాస్టర్ చిక్కాల రాకడ పీటర్ పాల్ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నం ధర్మారావు తల్లిదండ్రులు భూషణం, దవనమ్మ వర్ధంతి సందర్భంగా కొలకలూరు గ్రామ బైబిల్ మిషన్ చర్చి ఆవరణలో ఆదివారం వృద్ధులకు, వితంతువులకు నూతన దుస్తులు బహూకరించారు. ఈ సందర్భంగా ఉన్నం ధర్మారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను ప్రతిఒక్కరు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఉన్నం భూషణం, ఉన్నం భరత్, పొన్నెకంటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తును వేగిరపర్చండి : ఐజి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం,నెల్లూరు జిల్లాల పోలీస్ అధికారులతో రేంజ్ ఐ.జి. పాలరాజు, ఆదివారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా జరిగిన నేర సమీక్షలో పెండింగ్ కేసులు, రౌడ షిటర్స్, పిడియాక్ట్, ప్రాధాన్యత కలిగిన కేసులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై నమోదు అయిన కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, సిబ్బంది ప్రవర్తన మొదలైన అంశాలపై చర్చించారు. పోలీసు స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులు పట్ల మర్యాదగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కేసు నమోదు అయిన తర్వాత కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని ఐ.జి.తెలిపారు. ఏదైనా నేరం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్థుడు వదిలిన సాక్ష్యాదారాలు, సిసి కెమెరాల ఫుటేజీలను క్రోడీకరించి ముద్దాయిలను పట్టుకొని, బాదితులకు న్యాయం చేయాలన్నారు. పెండింగ్ కేసులను రీజన్ వైజ్ గా విశ్లేషించి వాటి దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌సి,ఎస్‌టి కేసులకు సంబంధించి దర్యాప్తును సాధ్యం అయినంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, బాలికలు, చిన్నారులు అదృశ్యం అయినట్లు ఫిర్యాదు అందిన వెంటనే ఏ విధమైన అలసత్వం చూపించకుండా



చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రాత్రిపూట గస్తీ నిర్వహించే సిబ్బందికి సంబంధిత స్టేషన్ ఎస్. హెచ్.ఓ బ్రీఫింగ్ నిర్వహించి పంపాలన్నారు. ఈ సమావేశంనకు గుంటూరు రేంజ్ పరిధి లోని ఐదు జిల్లాలలోని యస్పిలు, అదనపు యస్పిలు, డియస్పిలు, సి.ఐ. లు మరియు అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్.ఐలు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ దాతలకు సన్మానం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

మాత శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణం వెనుక దాతృత్వం దాగి ఉందని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. వెలకట్టలేని మాతృత్వానికి విలువ కట్టి ఎంసిహెచ్ పూర్తి చేస్తున్నందుకు ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆసుపత్రి శుశ్రుత హాలులో ఎంసిహెచ్ కు సహకరిస్తున్న జింఖానా సభ్యులు డాక్టర్ మొవ్వ వెంకటేశ్వర రావు, మొవ్వ వేదవతిలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభ లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజు వేలాది మంది రోగులు వస్తున్నారని చెప్పారు. ఆసుపత్రి పై నమ్మకంతో వస్తున్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. రోజు రోజుకు రోగుల సంఖ్య పెరిగిపోతోందని ముఖ్యంగా కాన్పుల వార్డు లో ప్రతి రోజు 40 నుంచి 50 వరకు ఆపరేషన్లు చేస్తున్నారని అయన గుర్తు చేసారు. గత 20 ఏళ్ళ క్రితం పోల్చుకుంకుంటే ఆపరేషన్లు మూడింతలు పెరిగిందని ఆయన అన్నారు. పెరుగుతున్న రోగుల సంఖ్య తో పాటు అవసరాలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. పదేళ్ల క్రితం నిలిచిపోయిన ఈ ఏంసిహెచ్ ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్సి ఎంటి కృష్ణ బాబు లు ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణ పనులు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారని ఆయన చెప్పారు. దాదాపు 2,69,245 చదరపు అడుగుల విస్తీర్ణం లో సెల్లార్ తో పాటు బహుళ అంతస్థుల భవనం పూర్తి కానున్నదని ఆయన అన్నారు. ఇందులో ప్రసూతి, స్త్రీ వ్యాధుల చికిత్స విభాగానయికి 300 పడకలు,



వైద్యులకు సన్మానం చేస్తున్న సూపరింటెండెంట్ తదితరులు

చిన్న పిల్లల విబాగానికి 300 పడకలు కేటాయించారని ఆయన చెప్పారు. ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురు ఉండటం తో జింఖానా ఈ పనులు చేపట్టిందని ఆ యన అన్నారు. ప్రభుత్వం రూ.35 కోట్లు, జింఖానా రూ.100 కోట్ల తో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 17 మెడికల కళాశాలలను తీసుకుని వస్తుందని, పాత వైద్య కళాశాలలను బలోపేతం చేస్తున్నాదని ఆయన చెప్పారు. మొదటి అంతస్తుకు మొవ్వ వెంకటేశ్వరావు తల్లితండ్రుల పేరును పెట్టేందుకు నాలుగు కోట్లు ఇవ్వడం అభినందనీయమని ఆయన అన్నారు. అదేవిధంగా రెండు మూడు అంతస్థుల కూడా మరింతగా సహాయం చేయాలనీ ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ మొవ్వ వెంకటేశ్వర రావు, మొవ్వ వేదవతి మాట్లాడుతూ ఎంసిహెచ్ నిర్మాణానికి తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. తమ జీవితంలో జరిగిన సంఘటనలు ఇతరులకు రాకుండా ఉండేందుకు తమ వంతు సహాయాన్ని అందచేసినట్లు అయన చెప్పారు. అనంతరం ఎంసిహెచ్ నిర్మాణ పనులను డాక్టర్ మొవ్వ వెంకటేశ్వర రావు, వేదవతి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ లు పరిశీలించారు. ఎప్పటి లోగా నిర్మాణ పనులు జరుగుతాయని సమన్వయ కర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, జింఖానా సమన్వయకర్తలు డాక్టర్ బాలభాస్కర రావు, డాక్టర్ హనుమంత రావు లు పాల్గొన్నారు.

పట్టణంలో కొనసాగుతున్న 144 సెక్షన్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

స్థానిక అంబేద్కర్ సెంటర్లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి అవమానించారని ఆరోపిస్తూ పలు దళిత సంఘాలు ఇచ్చిన పిలుప ్రమేరకు ఆదివారం చేపట్టిన బంద్ ప్రభావం కనిపించలేదు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీస్ ఆధ్వర్యంలో పొన్నూరు అర్బన్ సీఐ కాజా అల్తాఫ్ హుస్సేన్ పర్యవేక్షణలో పట్టణంలో విధించిన 144 సెక్షన్ అమలు చేసేందుకు పూర్తి భద్రత పోలీసు భద్రత నడుమ గట్టి బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పట్టణంలో కూడలి ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది పీకెట్లు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు చేపట్టారు. బందు నిర్వహించాలని పట్టణంలో చేరిన దళిత సంఘాల సభ్యులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అవాంఛనీయ జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. పోలీసు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. కాగా పట్టణంలో పలు వాణిజ్య సంస్థలు, వ్యాపార దుకాణాలు, కాఫీ హోటల్ యధావిధిగా పనిచేశాయి. పట్నంలో బందు ప్రభావం కనిపించలేదు.

వివిఐటి బాలోత్సవ్ నిర్వహణకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి- తెనాలి

ప్రపంచ తెలుగు బాలల పండుగ బాలోత్సవ్ 2023 సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరు ప్రాంగణం సిద్ధమైనది. ప్రఖ్యాతి గాంచిన వివిఐటి బాలోత్సవ్ వేడుకలలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 600 పాఠశాలల నుండి 14వేల మంది విద్యార్థులు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. 20 అంశాలు, 61 విభాగాలలో పోటీలు నిర్వహించే బాలోత్సవం కోసం వివిఐటి ప్రాంగణలో 30 వేదికలను ఏర్పాటు చేసారు. వివిఐటి చైర్మన్, బాలోత్సవ్ అధ్యక్షులు వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు, దూరప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం గుంటూరు, విజయవాడ నగరాలలోని బస్టాండు, రైల్వే స్టేషన్ నందు సేవా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కళాశాలకు చెందిన బస్సుల ద్వారా బాలోత్సవ్ ప్రాంగణానికి తరలించటం జరుగుతున్నదన్నారు. పోటీలలో పాల్గొనేందుకు బాలోత్సవ్ ప్రాంగణానికి చేరుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలను అందచేస్తున్నామని తెలిపారు. ఆయా రంగాలలో నిష్ణాతులైన నిపుణులను న్యాయనిర్ణేతలుగా నియమించి పోటీలలో పాల్గొనే విద్యార్థులకు తగు సూచనలు అందించటం జరుగుతున్నదన్నారు. బాలోత్సవ్ ప్రాంగణంలో వివిఐటి కళాశాలకు చెందిన



ఉత్సవాలకు ముస్తాబైన వివిఐటి కళాశాల ముఖద్వారం.

స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ , 600 మంది ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు అవసరమైన సేవ కార్యక్రమాలను అందిస్తారని, 300 మంది ఎన్.సి.సి విద్యార్థులు రక్షణ, భద్రత కొరకు కేటాయించడం జరిగిందన్నారు. వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్న నేపథ్యంలో ప్రాథమిక చికిత్స కొరకు పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్యకేంద్రం, అంబులెన్సును ఏర్పాటు చేశామన్నారు. పోటీ వేదికల వద్ద వివిఐటి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులకు సహాయ సహకారాలను అందిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి





పసుపు లేటి కేశవులు

ప్రజాశక్తి-నకరికల్లు

రోడ్డుప్రమాదంలో నకరికల్లు మండల ఈనాడు విలేఖరిగా పని చేస్తున్న పసుపు లేటి కేశవులు (49) మృతి చెందారు. చల్లగుండ్ల నుండి చీమల మర్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు డివైడర్ ను ఢీ కొట్టడంతో మతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గత 22 ఏళ్లుగా ఈనాడు విలేకరిగా విలేఖరిగా పని చేస్తూ మండలంలోని ఎన్నో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాడు. కేశవులు మృతిపై వైసిపిపి మండల కన్వీనర్ భవ నం రాఘవరెడ్డి, అధికారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.కేశవులకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన గుంటూరు కర్నూలు రహదారి మండలంలోని సాతులూరు రెడ్డి పేరంటాలమ్మ తల్లి దేవాలయం వద్ద ఆదివారం చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు వైపు నుండి వినుకొండ వైపు వెళ్తున్న బైకును నరసరావుపేట నుండి గుంటూరు వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని డి కొండంతో బైకు ఉన్న తల్లి తండ్రి కుమారుడికి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి ఇద్దరికీ కాలు విరిగింది ప్రమాదం జరిగిన వెంటనే వీరిని ద్వారా నరసరావుపేట వైద్యశాలకు తరలించినట్టు స్థానికులు తెలిపారు దీనిపై పోలీసులు విచారిస్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సింది.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నకాంగ్రెస్ నాయకులు

కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఇటీవల తుఫాను వలన పంట నష్టపోయి ఆత్మహత్యకు పాటుపడిన దుగ్గిరాల గ్రామానికి చెందిన కౌలు రైతు తుళ్ళి మిల్లి బసవ పున్నయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో శనివారం రాత్రి మతుడి కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు మండల పార్టీ అధ్యక్షుడు కేశంనేని శ్రీ అనిత వల్లూరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదివారం మతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి 35 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు .అంతకుముందు మండలంలో పర్యటించి ముంపుకు గురైన పంటచేలను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తావలి, జిల్లా పార్టీ అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వర రావు, నియోజకవర్గం ఇంచార్జ్ ఎస్కే సలీం, మండల నాయకులు షేక్ జాన్ పసుపులేటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో భారీ ఆటో ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్లు చేరుకుంటున్న సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్టీఆర్ ట్రస్ట్ డైరెక్టర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు మన్నవ మోహన కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు లో ఆటోలతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఆటోల ర్యాలీని మన్నవ మోహన కృష్ణ జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

ఈ ర్యాలీ నిద్దేశించి మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ లోకేష్ యువ గళం పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోనెలకొన్న పరిస్థితులను ప్రజలకు తెలియజేస్తున్నారని అన్నారు. మరో 3 నెలలలో టిడిపి అధికారంలోకి రావడం, ప్రజా రంజక పాలన అందించడం తధ్యమన్నారు.

సాతులూరు- చందవరం రోడ్డుపైనే లారీల పార్కింగ్

ప్రజాశక్తి-నాదెండ్ల

రోడ్డుపైనే లారీలు పార్కింగ్ చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటన మండలం లోని సాత ఎలూరు చందవరం గ్రామాల మధ్య చోటు చేసుకుంది సేకరించిన వివరాల ప్రకారం సాతులూరు చందవరం గ్రామాల మధ్య రెండు స్టీమ్ రైస్ మిల్లు కు వచ్చే లారీలు రోడ్డుపైనే పార్క్ చేయటంతో ఆ మార్గంలో తిరిగే వాహనాలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు ఈ మార్గం సాతులూరు నుండి తూబాడు చందవరం చిరుమామిళ్ల నాదెండ్ల తిమ్మాపురం బోయపాలెం ఎడ్లపాడు గ్రామాలను కలుపుతూ వెళుతుంది ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి కాలేజీలు పాఠశాలలో సంబంధించిన బస్సులు వాహనాలు విద్యార్థులు రైతులు నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఈ రోడ్డుపై లారీలు పార్కింగ్ చేయటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు వెంటనే వివాహనాల రోడ్డుపై నుండి సంబంధిత అధికారులు లోన రైస్ మిల్లు పార్కింగ్ చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు నిత్యం ఈ రైస్ మిల్లు ల వద్దకు పదుల సంఖ్యలో లారీలు వస్తువు పోతుంటాయి ఈ విధంగా రోడ్డుపై ఉండటంతో ప్రమాదాలు జరిగినాయి వెంటనే వీటిని రోడ్డుపై నుండి మిల్లు ఆవరణ లోకి పంపించాలని రహందారులు కోరుతున్నారు.

అన్నదమ్ముల ఘర్షణ.. కేసు నమోదు

ప్రజాశక్తి-దుగ్గిరాల

కుటుంబ కలహాల నేపథ్యంలో సొంత అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుండి పోలీస్ స్టేషన్ కు చేరింది. మండలంలోని పేరుకలపూడి గ్రామానికి చెందిన సోదరులు బొంత వెంకటేశ్వరావు బొంత శివరామకృష్ణ కు గతం నుండి మనస్పర్థలు ఉన్నాయి. శని వారం గ్రామంలో జరుగుతున్న ఒక శుభకార్యానికి వెళ్లి అక్కడ ఘర్షణ పడ్డారు ఈ క్రమంలో శివరామకష్ణ రాయి తీసుకొని వెంకటేశ్వర కొట్టగా అతనికి తీవ్రంగా గాయాలయ్యాయి .వెంకటేశ్వరరావు తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు ఆసుపత్రి సమాచారం మేరకు దుగ్గిరాల పోలీస్ స్టేషన్ రైటర్ అశ్విని కుమార్ కేసు నమోదు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు సీజ్

ప్రజాశక్తి తెనాలి :స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో అధికారుల దాడులలో అనధికారికంగా ఇసుక తరలిస్తున్న లారీలు పట్టుబడ్డాయి. ఎస్ఈబి సిఐ ఏవి చలం వెల్లడించిన వివరాల ప్రకారం ఎస్ఈబి అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు తెనాలి ఎస్ఈబి పరిధిలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ గ్రామం కొలకలూరు లో అనధికారకంగా 30 టన్నుల ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. అలాగే మరో రెండు ఇసుక లారీలను పట్టుకుని రూ.15,250 అపరాద రుసుం విధించినట్లు చెప్పారు.

రోడ్డును తవ్వేశారు

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రజా ధనంతో వేసిన రోడ్డును ఉండవల్లికి ఓ వ్యక్తి తవ్వేశాడు. వీరిపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాల కోసం నిర్మించిన రోడ్డును తవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అదేమని అడిగితే అంతు చూస్తానని బెదిరిస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. సదరు వ్యక్తి నాడు-నేడు పనుల్లో కూడా నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే విచారణ జరిపి తవ్విన రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ



పండ్లలో రారాజైన మామిడి ప్రపంచంలోనే అత్యధికంగా ఏటా 25 మిలియన్ టన్నులు భారతదేశంలోనే ఉత్పత్తి అవుతున్నాయి... అయితే ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, చీడపీడలు, సాగునీటి సౌకర్యాలు, మార్కెట్లో ధరలు వంటి కారణాలతో మామిడి సాగు ఏటేటా తగ్గిపోతూ వస్తోంది... ఈ క్రమంలో ఏలూరుజిల్లా నూజివీడులోని డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యు ఆధ్వర్యంలోని మామిడి పరిశోధనా స్థానం ఏటా తన పరిశోధనా పరిధిని విస్తృతి చేసుకుంటూ రైతులకు మామిడి పంటను కాపాడుకునే సస్యరక్షణ చర్యలను తెలియజేస్తోంది. రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ రానుందని, తోటలను ఎవరూ నరికేయవద్దని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ సందర్భంగా పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి పలు విషయాలను 'ప్రజాశక్తి'కి వివరించారు.

ప్రశ్న : మామిడి సాగుపై ఎలాంటి పరిశోధనలు జరుగుతున్నాయి?

మామిడిలో అధిక సాంద్రతతో మొక్కలను వేసి ఉత్పత్తి పెంపుదల, చీడ పీడల నివారణ, విదేశీ ఎగుమతుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా అనేక అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మామిడి అభివృద్ధికి, అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, ప్రూనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం, నీటి యాజమాన్య పద్ధతులను వివరించటం, కోతలు పూర్తయిన తర్వాత తోటల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి రైతాంగానికి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి తెలియజేస్తున్నాం. మామిడి సాగున్న అన్ని ప్రాంతాలకు మా పరిశోధనా ఫలితాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : మామిడికి ఎలాంటి వాతావరణం అనుకూలం?

మామిడికి ప్రధానంగా రాత్రిపూట చలి వాతావరణం, పగలు వేడి వాతావరణం ఉన్నప్పుడు మొగ్గలు వస్తాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మామిడి పూతలు ఉధృతంగా రావటానికి అవకాశం ఉంది. నూజివీడు, విస్సన్నపేట, చాట్రాయి మండలాల్లో కొన్ని చోట్ల ముదురుకాపులు వచ్చాయి. మామిడి సాగులో పూత దశ నుంచి కోత దశ వరకూ రైతాంగం తీసుసుకోవాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. వర్షాలు పడి ఆగగానే మామిడికి తేనేమంచు, తామర పురుగులు, పక్షికన్ను తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వీటి నివారణకు తక్షణమే ఇమిడిక్లోరిట్ 0.3 మి.లీ.గ్రాములు లేదా త్రోమిథాక్సిమ్ 0.5 గ్రాములు, సిలింధ్రనాశినిలైన కార్బన్‌డిజమ్ 1 గ్రాము లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా మ్యాంకోజబ్ 2 గ్రాములు, జిగురు 0.5 మిల్లీ గ్రాములు కలిపి పిచికారీ చేయించాలి.

ప్రశ్న : తెగుళ్ల నివారణా ఏ పద్ధతులను పాటించాలి?

తేనెమంచు, తామర, చెదల పురుగు, తెగుళ్లలో పక్షికన్ను తెగులు, బూడిద, నల్లమచ్చ తెగులు ముఖ్యమైనవి. తేనే మంచు పురుగు పూత, లేత చిగుళ్ల నుంచి రసం పీల్చడంతో పూత రాలిపోయే ప్రమాదం ఉంది. ఈ పురుగులు విసర్జించిన జిగురుపై మసి తెగులు వృద్ధి చెందుతుంది. నల్లతామరతో పాటు ఇతర, పురుగులు, తెగుళ్ల నివారణా చర్యలపై పెద్దఎత్తున రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి సలహాలు, సూచనలు అందిస్తున్నాం. మంచు పెరిగే కొద్దీ మామిడి పిందెలు, కాయలకు మంగు, దోమపాటు, ఇతర మచ్చలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల మా వంతుగా కాయల రక్షణ కోసం కవర్లు వాడమని చెబుతున్నాం. వీటిని పిందె దశలోనే తొడిగితే కాయ నాణ్యతగా ఉండి మార్కెట్లో అధిక ధర లభిస్తుంది.

ప్రశ్న : టాప్ వర్కింగ్ పద్ధతులు ఎలా పాటిస్తారు?

నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలోని క్షేత్రంలో ఎక్కువ వయసున్న ముదురు చెట్లను మొదలు నుంచి పైవరకు నరికి తొలగించి టాప్ వర్కింగ్ పద్ధతిలో పూర్తిగా వాటినే పునరుద్ధరిస్తున్నాం. దీనిలో భాగంగా చెట్టును ఆరడుగుల ఎత్తు వరకు తొలగించి అక్కడి నుంచి కావాల్సిన రకాన్ని అంటు కట్టి పునరుద్ధరిస్తున్నాం. ఇలా చేయటం వల్ల రెండేళ్లకే దిగుబడి ప్రారంభమవుతుంది. అలాగే అధిక, పాక్షిక సాంద్ర పద్ధతుల్లో రైతులతో మొక్కలు నాటించి వాటిలో ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. ముదురుతోటలు ఉన్న రైతులతో కూడా మాట్లాడి పునరుద్ధరణ చర్యలను ప్రోత్సహిస్తున్నాం. ఒకే మామిడి చెట్టుకు అనేక రకాల కాయలు కాసేలా చేసే అంట్లను తయారు చేయిస్తున్నాం.

ప్రశ్న : లింగాకర్షణ బుట్టలతో మేలు జరుగుతుందా?

మామిడికి ఆశించే పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టను రూపొందించి రాష్ట్రంలోని మామిడి రైతులకు ఇక్కడి నుంచే అందించే ఏర్పాట్లు కొనసాగిస్తున్నాం. ప్రతికూల వాతారణం వల్ల తోటల్లో వచ్చే మార్పులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఒక ఏడాది కాస్తే మరో ఏడాది కాయకపోవటం మామిడి సాధారణ లక్షణం. గతేడాది మామిడి కాపు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది కాపు ఎక్కువగా ఉంచొచ్చునని ఇప్పుడున్న పరిస్థితిని బట్టి రైతులు భావిస్తున్నారు. నూజివీడు ప్రాంతంలోని బంగినపల్లి, తోతాపురి, చిన్న, పెద్ద రసాలు, చెరకు రసం వంటి మామిడి తోటల్లో పూత ప్రస్తుతం ఉధృతంగా కనిపిస్తుంది. ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకూ పూతలు వచ్చాయి. మిగతా భాగం ఇప్పటి నుంచి వస్తుంది.

ప్రశ్న : నాణ్యమైన పంట దిగుబడులు రావాలంటే ఏమి చేయాలి?

నూజివీడు మండలం సిద్ధార్‌నగర్ ప్రాంతంలో 26 ఎకరాల్లో రూ.275 కోట్లతో మ్యాంగో పల్ప్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ట్రాప్స్, లూర్స్ వినియోగంపైన రైతులకు తెలియజేస్తున్నాం. రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ రానుంది. తోటలను ఎవరూ నరికేయొద్దు. తెల్లపూత సమయంలో రసాయన మందులు పిచికారీ చేయొద్దు. పొటాషియం, నైట్రేట్, జింక్, బోరాన్, మాంగనీస్‌లను పిచికారీ చేసుకోవాలి. దీని వల్ల చెట్టు ఆరోగ్యంగా ఉంటుంది. కాయల నాణ్యత అధికం అవుతుంది. తేనెమంచు పురుగు, తామర పురుగుల ఉధృతిని బట్టి రసాయన మందుల పిచికారీ చేయాలి.

టెన్నిస్‌లో రాణిస్తున్న చిన్నారులు



కోచ్ బి.బాబు నాయక్‌తో చిన్నారులు శివశశిప్రియ, సూక్తిశ్రీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణానికి చెందిన చిన్నారులు పివి సూక్తి శ్రీ, ఎస్.శివ శశి ప్రియలు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. టెన్నిస్ క్రీడలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. నరసరావుపేటలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న సిబిఐటి స్కూల్‌లో సూక్తి శ్రీ 5వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శివ శశి ప్రియ 7వ తరగతి చదువుతున్నారు. స్థానిక జిల్లా కోర్టు సముదాయాల వద్ద గల ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో టెన్నిస్ నిపుణులు బుక్యా బాబు నాయక్ ఆధ్వర్యంలో వీరిద్దరూ ప్రత్యేక శిక్షణ తీసు కుంటున్నారు. అండర్-10, అండర్ -12 విభాగాలలో జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయి లో జరిగిన అనేక పోటీల్లో సూక్తి, శశిలు తమ సత్తా చాటారు. ఈ ఏడాది సెప్టెం బర్‌లో తిరుపతి జిల్లా తిరుచానూరులో జరిగిన సౌత్ ఇండియా పోటీలలో సైతం సత్తా చాటి రన్నరప్ గా నిలిచారు.

మరిన్ని పతకాలు సాధిస్తా



పివి సూక్తి శ్రీ

రాష్ట్ర స్థాయిలో జరిగిన అనేక టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటి సౌత్ ఇండియా టెన్నిస్ పోటీలలో సత్తా చాటి రన్నరప్ గా నిలవడం గర్వంగా ఉంది. ముఖ్యంగా టెన్నిస్ లో రాణించడం పట్ల తండ్రి ప్రోత్సాహం చాలా ఉంది. ఆటలు ఆడే క్రమంలో కొన్ని సందర్భాలలో ఓటమి చెందినా, చిన్న చిన్న గాయాలైనా తండ్రి ప్రోత్సాహం మరువ లేనిది. కోచ్ సలహాలు సూచనలు బాగా ఉపయోగపడు తున్నాయి. క్రీడల్లో మెలకువలు నేర్చుకుని జాతీయ స్థాయిలో సత్తా చాటి ఆటల కోటాలో కొలువు సాధిస్తా.

జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం



ఎస్.శివ శశిప్రియ

కోచ్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జాతీయ స్థాయి టెన్నిస్ రాణించాలన్నదే నా లక్ష్యం. కోచ్ బాబు నాయక్ పర్యవేక్షణలో టెన్నిస్ శిక్షణ తీసుకుంటున్నాను. కోచ్ సలహాలు సూచనలు పాటిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడాను. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, తల్లిదండ్రులకు, చదువుతున్న స్కూల్‌కు జిల్లాకు, ముఖ్యంగా కోచ్‌కు పేరు తెచ్చేలా మెరుగ్గా రాణిస్తాననే నమ్మకం నాకుంది.

పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

నేటి ఆధునిక కాలంలో చిన్నా రులు స్మార్ట్ ఫోన్లకు, టివి, కంప్యూటర్ లకు పరిమితం అవుతున్నారని కోచ్ బి. బాబు నాయక్ అన్నారు. స్మార్ట్ ఫోన్ల మోజులో పడి స్నేహితులతో కూడా ఆదుకునేందుకు ఆశక్తి చూపడం లేదని చెప్పారు. టెన్నిస్ ఇతర ఆటల వలన మానసిక పునరుత్తేజానికి దోహదం చేయడంతో పాటు శరీరానికి మంచి వ్యాయామం అందుతుందన్నారు. తోటి చిన్నా రులతో స్నేహ పూర్వక సంబంధాలు మెరుగుపడడంతో పాటు చిన్నారులకు ఆరోగ్యంతో పాటు మెదడు చురుకుగా ఉంటుంది.



కార్మికులపై అక్రమ కేసులు కొట్టివేత

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ వర్కర్లకు 2018లో పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ సమ్మె జరుగుతున్న సందర్భంగా కార్మికులపై గత ప్రభుత్వం అక్రమంగా కేసులను శనివారం కొట్టి వేయడం జరిగిందని సిఐటియు మండల నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 45 మంది కార్మికులు, సిఐటియు నాయకులు పెండింగ్ వేతనాలు చెల్లించమని నిరసన చేసి నందుకు కార్మికులపై కేసులు పెట్టడం అన్యాయమని విమ ర్శించారు. అణిచివేతతో ఉద్యమాలు ఆపలేరని పోరాటమే మార్గమని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి వేపూరి గోపాలరావు, మున్సిపల్ వర్కర్లు కుంభ కొం డలు, ప్రతాపు, రామారావు, ఆంజనేయులు,వీరమ్మ, మార్తమ్మ, సుజాత, శివ,సాగర్ బాబు,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలోని వావిలాల కాలనీలో సమస్యలు తెలుసు కుంటున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు

వావిలాల కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వావిలాల కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పిం చాలని జనసేన నియోజక వర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని 6 వార్డులో ఉన్న వావిలాల కాలనీలో(కొత్త కాలనీ) అప్పారావు ఆదివారం పర్యటించారు. కాలనీ వాసులు సమస్యలను ఏకరువు పెట్టారు. వావిలాల పార్కు నిర్మాణం సమయంలో తమ గుడిసెలను ఖాళీ చేయించారని, తమకు ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయ లేదని, పట్టాలు కూడా ఇవ్వకుండా తమను గాలికొదిలేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిరోజుల క్రితం తుపాను ప్రభావంతో గుడిసెలు పూర్తిగా మునిగిపోయి, నడవడానికి దారి కూడా లేదని, పాములు తిరుగుతున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదని చెప్పారు. తాము 3వ వార్డుకి చెందినవాళ్లమని, 6 వవార్డులో ఉంటున్నామని తమకు టు వంటి సంబంధం లేదని చెబుతూ రెండు వార్డుల కౌన్సిలర్లు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భగా వెంకట అప్పారావు మాట్లాడుతూ రేపల్లె నుండి వచ్చిన అంబటి రాంబాబును సత్తెనపల్లి ప్రజలు ఆదరించగా లేనిది, 3 వార్డు నుండి 6వ వార్డుకు ప్రజలను ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. వారంలోగా కాలనీలో మట్టి రోడ్డు వేయక పోతే జనసైనికులలు చందాలు వేసుకుని మట్టిరోడ్డు నిర్మిస్తారని అన్నారు. కార్య క్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి సాంబశివరావు, 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ జన సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరుకే బాలుర వసతి గృహం..!

- నూజెండ్లలోని బాలుర వసతి గృహంలో మౌలిక వసతులు కరువు
- పాచిపట్టిన నీటి ట్యాంక్
- అపరిశుభ్ర పరిసరాలు



ప్రజాశక్తి- నూజెండ్ల

మండలంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు, పేరుకే వసతి గృహం కానీ కనీస సౌకర్యాలు కూడా లేవు. నూజెండ్ల ప్రభుత్వ బాలుర వసతి గృహంలో స్థానిక వసతి గృహంలో 100 మం దికు పైగా విద్యార్థులు ఉన్నారు. సరైన మరుగు దొడ్లు లేవు. వసతి గృహాలు, దాని పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తాగునీటి సదుపాయం కూడా అంతంత మాత్రమే. నీటి ట్యాంకు పాచి పట్టి పోయిం ఉంది. అందులోని నీటినే విద్యార్థులు స్నానానికి ఉపయోగించుకుంటున్నారు. దీంతో, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. తాగేందుకు బోరు నీటిని లేదా పక్కనే ఉన్న ప్రభుత్వ హై స్కూల్ వద్ద గల ఆర్వో ప్లాంట్‌కు వెళ్లి తాగుతున్నారు. తాము ఉంటున్న వసతి గృహానికి మెయిన్ గేటు లేకపోవటంతో పశువులు, పందులు లోపలకు వస్తు న్నాయని విద్యార్థులు చెబుతున్నారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరారు.



మానవ హక్కులను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని బి.సి కాలేజి గర్ల్స్ హాస్టల్ లో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వ హించినట్లు శ్రీ రామకృష్ణా సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు పరిరక్షించుకోవాలని, ముఖ్యంగా మహిళలు బాగా విద్యనభ్యసించి హక్కులను పరిరక్షించుంకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. అనంతరం కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్స్ అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌ఛార్జి సాయిలక్ష్మి,సేవా సమితి సభ్యులు షేక్ చిన్న లాలూ సాహేబ్, రిటైర్డు హెడ్ మాస్టర్ ముత్యాల పాపిరెడ్డి పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది ఉపేంద్రకు పితృ వియోగం

- మానుకొండ రాజయ్య భౌతిక కాయానికి పలువురు నివాళి
- కాటూరి మెడికల్ కళాశాలకు భౌతిక కాయం అప్పగింత





మానుకొండ రాజయ్య

ప్రజాశక్తి - యడ్లపాడు

హైకోర్టు ప్రముఖ న్యాయవాది మానుకొండ ఉపేంద్ర, ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయులు మానుకొండ రామారావు తండ్రి మానుకొండ రాజయ్య (94) ఆదివారం తెల్లవారు జామున మండల కేంద్రమైన యడ్లపాడులోని తన నివాసంలో మతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని పరిశోధనల నిమిత్తం కాటూరు మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు అప్పగించారు. తొలుత ఆయన నివాసం వద్ద సందర్శనార్థం ఉంచిన భౌతిక కాయాన్ని సిపిఎం, టీడీపీ, వైసీపీ, పలు ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖులు సందర్శించి నివాళులర్పిచారు. రాజయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరిలో కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకష్ణ, సిపిఎం మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు, చిలకలూరిపేట మండల కార్యదర్శి బి. శంకరరావు, ప్రముఖ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ జి. శివరామకష్ణ, రైతు సంఘం నాయకులు జె.శంకరరావు, ఎన్. తులశయ్య, జి. హరిబాబు, టిడిపి నాయకులు



పి. సదాశివరావు, వైసీపీ జిల్లా కార్యదర్శి అర్. చింతారావు, పుడమి బిల్డర్స్ అధినేత ఎం.సురేష్, సుందరయ్య స్మారక నాటకోత్సవ కమిటీ కన్వీనర్ ఎం.రామారావు, ఎన్.మాధవరావు, సిపిఎం సీనియర్ నాయకులు పి.సుబ్బారావు, మహిళ సంఘం



నాయకులు పి. అనంతరావమ్మ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. భావన్నారాయణ, కె. నళినికాంత్, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ సజన, తదితరులున్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.కాళిదాసు, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్, హేమంతదేవి, డాక్టర్ కొల్లా అమర్, శ్రీనివాసరెడ్డి, సీపీఐ నాయకులు, అర్. వెంకటేశ్వర్లు, కె. నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్త ఎన్. లక్ష్మీనారాయణ సంతాపం తెలిపారు.

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సత్యరాజు

ప్రజాశక్తి-గుంటూరు

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్ట్ /ఆప్కాస్‌లో చేర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు పిలుపునిచ్చారు. ఎపి 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ గుంటూరు జిల్లా కమిటీ సమావేశం సత్యరాజు అధ్యక్షతన ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ముత్యాలరావు మాట్లాడుతూ 104 ఉద్యోగులు గ్రామాలలో ప్రభుత్వం ప్రచారం చేసుకున్నటువంటి ఫ్యామిలీ డాక్టర్, అనేక రకాలైనటువంటి వైద్య సౌకర్యాలకు కీలకంగా ఉన్నటువంటి 104 ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం సరికాదన్నారు. 104 ఉద్యోగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్నటువంటి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన సిద్ధపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ సందర్భంగా సత్యరాజు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 104 ఉద్యోగులను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని తమ సేవలను అభినందించడంతోపాటు, కాంట్రాక్టు లేదా ఆప్కాస్‌లో చేర్చాలని 2019లో చెప్పిన ఇప్పటి వరకు హామీ హామీగానే ఉందన్నారు.ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. నెల నెల జీతాలు కూడా సకాలంలో అందకపోవటం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటివి ఉద్యోగులలో ఆందోళన నెలకొని ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆప్కాస్ లేదా కాంటాక్ట్‌లో చేర్చడం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి హేమలత, కోశాధికారి సాయిరాం, ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య అలవాట్లతో ఊపిరితిత్తుల సమస్యలు


మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్ కళ్యాణ్

ప్రజాశక్తి-గుంటూరు

అనారోగ్య అలవాట్లు దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల పనితీరును దెబ్బ తీస్తున్నాయని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి పల్మనరీ వైద్యులు డాక్టర్ పి.వెంకట్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో టి.వి.సాయిరామ్ అధ్యక్షతన జరిగిన ఆరోగ్యసభలో డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ మానవుల్లో వయస్సుతోపాటు ఊపిరితిత్తుల్లోనూ మార్పులు సంభవిస్తాయని, ప్రాణామాయం లాంటివి శ్వాసకోశాలను పటిష్టపరిచే వ్యాయామం చేయటం మంచిదని తెలిపారు. శ్వాశకోశ వ్యాధులలో సిఒపిడి, లంగ్ క్యాన్సర్, టిబి, బ్రాంకైటిస్, నిమోనియా ముఖ్యమైనవన్నారు. ఊపిరితిత్తిలో కొంతభాగం దెబ్బతిన్నా కూడా మనకు తెలియదని, కనీసం 25శాతం ఊపిరితిత్తులు పనిచేసినా శరీర అవసరానికి సరిపోతుందన్నారు. అయితే ఊపిరితిత్తులు దెబ్బతిన్న మనిషికి ఇన్ఫెక్షన్లు త్వరగా సోకే అవకాశం ఉందని తెలిపారు. ఊపిరితిత్తులు బాగున్నాయా లేదా అని ఙాఖీ, ాుజుుఎ టెస్ట్‌ల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు.ఊపిరితిత్తుల సమస్యలలో దాదాపు 70శాతం గాలి గొట్టాలలో సంభవిస్తున్నాయన్నారు. ఆస్తమా సమస్యకు ఇన్హేలర్, రోటాక్యాప్స్ రెండు పద్ధతులున్నా వాడే విధానం తెలిస్తే ఇన్హేలర్ మంచిదన్నారు. శ్వాసకోశ సమస్యలు గాలి కాలుష్యం వల్ల సంభవిస్తున్నట్లు చెప్పారు. కొంతమందికి పూల వాసన, సాంబ్రాని, అగరబత్తి, మస్కిటో కాయిల్స్ వల్ల కూడా ఆస్తమా వచ్చే అవకాశం ఉందన్నారు. మనం నివసించే గదులకు వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్ల కూడా ఆస్తమా వస్తుందని వివరించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ జన్యుపరంగా రాదని, వాతావరణ కాలుష్యం, ఆహార అలవాట్లు, దురవ్యసనాలు కూడా కారణం అని తెలిపారు. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరగటానికి ప్రాణాయామం చేయడం, రెస్పిరోమీటర్ వాడవచ్చన్నారు. క్షయ వ్యాధి గురించి మాట్లాడుతూ ఇది మామూలుగా ప్రాణాంతకం కాదని, ప్రస్తుతం చాలా మందులు వచ్చాయన్నారు. అయితే డాక్టర్ సూచనల ప్రకారం కోర్సు వాడాలని, లేకుంటే తిరిగి వ్యాధి తిరగబడుతుందని తెలిపారు. ఇది అంటు వ్యాధి అని దీని నివారణకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యం, ఉచిత మందులతోపాటు, పోషకాహారం తీసుకునేందుకు నెలకు రూ.500లు ఇస్తుందని వివరించారు.ఈ వ్యాధికి మందులు పూర్తి కోర్సు వాడేలోపే తగ్గినట్లుగా అనిపిస్తుంది అని, కానీ పూర్తిగా తగ్గే వరకూ కోర్సు వాడటం తప్పనిసరి అని తెలియజేశారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ కళ్యాణను సత్కరించారు. సభలో వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, విశ్రాంత అధికారి వి.సత్యనారాయణ, ఎన్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో ఘనంగా ప్రపంచ భూ దినోత్సవం


ప్రసంశా పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ పి.రత్నప్రసాద తదితరులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రపంచ భూ దినోత్సవాన్ని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విభాగ డైరెక్టర్ డాక్టర్ పి రత్న ప్రసాద్ మాట్లాడుతూ మానవ మనుగడతో పాటు జీవ కోటికి నేల- నీరు ఎంతో అవసరమన్నారు. నీరు లేకుండా నేల లేకుండా భూమ్మీద జీవరాసులు మనుగడ సాగించడం సాధ్యపడదన్నారు. ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని ప్లాస్టిక్ వ్యర్థాలలతో సారవంతమయిన నేల కూడా కలుషితమవుతుందన్నారు. మనిషికి మట్టి-నీరు గొప్ప వరమన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన భాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఆహార కొరత లేకుండా అందరికీ ఆహారాన్ని అందించే భాద్యత వ్యవసాయ విభాగ విద్యార్థుల పైన ఉందన్నారు. వ్యవసాయాన్ని దండగా అనే విధంగా కాకుండా వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా మార్చే విధంగా ఆధునిక వ్యవసాయంలో మార్పులు అవసరమన్నారు. ఆ దిశగా పలురకాల పరిశోధనలు ఇప్పటికే వ్యవసాయ రంగంలో జరుగుతున్నాయని అన్నారు. కర్ణాటక నుండి వచ్చిన ఆచార్యులు ప్రభావతి మాట్లాడుతూ అన్ని రకాల చదువులలో కెల్లా వ్యవసాయ సైన్స్ గొప్పదన్నారు. భారతదేశానికి వ్యవసాయమే వెన్నెముక అన్నారు వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ కూడా ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఉద్యోగం సాధిస్తారని తెలిపారు. అనంతరం వ్యవసాయ విభాగ విద్యార్థులకు వకృత్వ పోటీలను నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రసంశా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్. ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్, డాక్టర్ కె. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

457 మందికి కృత్రిమ చేతులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్‌ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి రాయల్ కన్వెన్షన్‌లో 457 మంది వికలాంగులకు కృత్రిమ చేతులు ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ.2కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు లబ్ధిదారులు రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి, పొరుగు రాష్ట్రాలు తెలంగాణా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుండి వచ్చారని నిర్వాహకులు తెలిపారు.కత్రిమ చేతుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి ప్రారంభించారు. బెంగుళూరు, జైపూరు, హైదరాబాద్ నుండి వచ్చిన టెక్నీషియన్లు మరియు మంగళగిరికి చెందిన 15 మంది ఫిజియోథెరపిస్టులు లబ్ధిదారులకు చేతులను అమర్చి వాటిని ఉపయోగించటంపై తర్ఫీదును ఇచ్చారు. అమెరికాకు చెందిన ఎల్ఎన్ మెడ్యూస్ ప్రోస్తేటిక్ హ్యాండ్ ఫౌండేషన్ గ్లోబల్ అంబాసిడర్ కెవి మోహన్ కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, ప్రెసిడెంట్ అందే రేవంత్, సెక్రటరీ గాజుల శ్రీనివాస రావు, అందే మురళి మోహన్, డాక్టర్ వంశీకృష్ణ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.





వీజే కాలేజ్, నిర్మల ఫార్మసి కాలేజ్, విమ్స్ ఫిజియోథెరఫీ కాలేజీ విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా లబ్ధిదారులకు సేవలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ మురు గుడు హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్లు జాస్తి రంగారావు, అన్నే రత్న ప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-గుంటూరు

విజయశ్రీ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక స్వర్ణభారతి నగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి హాజరైన ప్రజలకు బిపి, షుగర్, ఎముకల విభాగం, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగం వారు సుమారు 200 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ శ్రీఖర్, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ చందు ఉచితంగా వైద్యసేవలు అందిం చారు.


దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

నష్టపోయిన రైతుల్ని తక్షణమే ఆదుకోవాలి

నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- తెనాలి

పంట కాలువలు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతోనే రైతులు అధిక శాతం నష్టపోయారని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను పరిశీలించేందుకు ఆదివారం ఆయన తెనాలి వచ్చారు. పరిసర గ్రామాలలో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. పలువురు రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ఊహించని రీతిలో సంభవించిన భారీ వర్షాలకు రైతులు అధిక సంఖ్యలో నష్టపోయారన్నారు. వారిలో తీవ్ర నిరాశవాదం నెలకొందన్నారు. కొందరు రైతులు దాదాపు ఆత్మహత్యలు చేసుకునే స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినాయకత్వం పిలుపుమేరకు రైతుల్లో మనోధైర్యాన్ని కల్పించేందుకు పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే పంట నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ పొలం గట్లపై కాకుండా వేదికపై నుంచి పొలాలను పరిశీలించడం దారుణమన్నారు. గతంలో నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికీ పరిహారం అందలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే పంట నష్టం అంచనాలను సిద్ధం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.50 వేలం పరిహారం చెల్లించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతుల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ చందు సాంబశివుడు నాయకులు కార్యకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఏపీకి ప్రత్యేక హోదా

గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



కాంగ్రెస్ పార్టీతోనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. తుపాను కారణంగా ముంపుకు గురైన పంట పొలాలను ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు, గుండిమెడ గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. వరి పంట సాగు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి, సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. త్వరలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి రాహుల్ గాంధీ, అమరావతి ఉద్యమానికి ప్రియాంక గాంధీ మద్దతు తెలిపేందుకు రానున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే వంద రోజుల్లో పెను మార్పులు రానున్నాయి అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ సలీం తాడేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'నాగార్జునసాగర్' శంకుస్థాపన దినోత్సవం

ప్రజాశక్తి-విజయపురి సౌత్

మానవ నిర్మిత ఆధునిక దేవాలయం అయిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేసి ఆది వారానికి 69 సంవత్సరాలు అయింది. 1955 డిసెం బర్ 10వ తేదీన అప్పటి భారతదేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు పనులు 1960లో ప్రారంభించారు ఈ ప్రాజెక్టుకు నిర్మాణం ఖర్చు 1300 కోట్ల రూపాయలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లోని గుంటూరు జిల్లా, నల్గొండ జిల్లా మధ్య ఉన్న కష్ణా నదిపై నిర్మించబడ్డ ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పెద్దది దేశంలో జలాశయ సామర్థ్యంలో రెండవ స్థానం, ఆనకట్ట పొడవులో మొదటి స్థానంలో ఉంది. కృష్ణా నదిపై నిర్మించబడ్డ ఆనకట్టలో నాగార్జున సాగర్ అతిపెద్ద బహుళార్ధసాధక ప్రాజెక్టు, బ్యాంకు ఇరువైపులా రెండు ప్రధాన విద్యుత్ తయారీ కేంద్రాలు ఉన్నాయి.

ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 48 టీఎంసీలు అలాగే కనీస స్థాయి నిల్వ 213 టిఎంసిలు, విద్యుత్ ఉత్పత్తి సామ ర్థ్యం 960 మెగావాట్లు. ఈ ప్రాంతానికి ఉన్న చరిత్ర ప్రాధాన్యం వలన ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు అని పేరు పెట్టారు. నాగార్జునసాగర్ ప్రముఖ బౌద్ధ చారిత్రక స్థలం. శాతవాహన కాలము నాటి శ్రీ పర్వతమే నాగార్జున కొండ, ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో బోధనలు చేసినట్టుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. జలాశయ నిర్మాణంలో సమయంలో ఇక్కడ లభించిన అమూల్యమైన చారిత్రక కట్టడాల శిథిలాలను జలాశయం మధ్యలో నాగార్జున కొండ ప్రదర్శన శాలలో భద్రపరిచారు. ఇది అప్పటి గుంటూరు జిల్లా ఇప్పుడు పల్నాడు జిల్లాలో విజయపురి సౌత్ లోని నాగార్జున కొండగా పిస్తున్నారు. విజయపురి సౌత్ లో విమాన శిక్షణ కోసం నాగార్జున సాగర్ లో చిన్నపాటి విమానాశ్రయం కూడా ఉంది. ఈ సందర్భంగా ఆదివారం ఓ కార్యక్రమం నిర్వ హించారు. కార్య క్రమంలో ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ అధికారులు, నాగార్జున ప్రాజెక్ట్ గేట్లు కుడి కాలువ సబ్ డివిజన్ అధికారులు సిఇ మురళీధర్‌నాథ్, ఈఈ. శ్రీహరి, డిఈ. మురళీధర్, జేఈ లు బాబు మియా, లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదివారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ అధికారులు, నాగార్జున ప్రాజెక్ట్ గేట్లు కుడి కాలువ సబ్ డివిజన్ అధికారులు



నాగార్జున కొండను సందర్శించిన అమెరికా బౌద్ధ పరిశోధకులు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ప్రపంచంలో రెండో ఆర్కిలాజికల్ ఐలాండ్ అయినా నాగార్జున కొండను అమెరికాలో స్థిరపడి బౌద్ధంపై పరిశోధనలు చేస్తున్న ప్రవాస భారతీయుడు భాస్కర్, తలాటం నగేష్ బౌద్ధ కేంద్రాల సంరక్షణలో భాగంగా ఆదివారం ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తో సందర్శించారు. వీరికి నాగార్జున కొండ మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ స్వాగతం పలికి అనంతరం మ్యూజియంలోని బౌద్ధ శిల్పాలు శాసనాలు పురావస్తు వస్తువులు గురించి, విశ్వాకులు కాలంలో శ్రీ పర్వత విజయపురిగా పిలవబడిన నాగార్జునకొండ చారిత్రక విశేషాలను వివరించారు. ఆ తర్వాత నాగార్జున కొండపై పునర్నిర్మించిన క్రీస్తు శకం మూడో శతాబ్దం నాటి సింహళ విహారం, మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, చైత్యం, మధ్యయుగపు జైన దేవాలయాలు ఇనుపయోగపు సమాధి రెడ్డి రాజు నిర్మించుకున్న అవశేషాలను డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి వివరించారు నాగార్జున కొండల సంబంధించిన బౌద్ధ శిల్పాలు న్యూయార్క్ మెట్రో పాలిటెక్ మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శనలో ఉన్నాయని వాటిని తాము చూసిన తర్వాత నాగార్జున కొండను చూడాలనిపించి ఇక్కడికి వచ్చినట్లుగా మహాయాన బౌద్ధ పరిశోధకుడు భాస్కర్, జైన బౌద్ధ పరిశోధకుడు తలాటం నగేష్ తెలిపారు.



తురకపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా ప్రచారం నిర్వహిస్తుండగా కన్నాను అడ్డుకున్న పోలీసులు

కన్నా లక్ష్మీనారాయణను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని తురకపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్ని ఇంటింటికి తిరుగుతున్న టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ను టీడీపీ కార్యకర్తలు,జనసేన కార్యకర్తలను పోలీసుల అడు ్డకున్నారు.ఇంటి ఇంటికి తిరగాలంటే అనుమతి కావాలంటూ ఎస్సై కిషోర్ బాబు,పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు.ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ ఎస్ఐ కిషోర్ బాబు పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదు.నియోజకవర్గంలో ఉన్న మంత్రిని కూడా ఇలాగే పర్మిషన్ కావాలంటూ అడ్డుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్లో అనుమతి తీసుకున్నాం అని టీడీపీ,జనసేన కార్యకర్తలు అన్నారు.



విజయపురిసౌత్‌లో వనసమారాధనలో పాల్గొన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మద్దాలి గిరిధరరావు తదితరులు



మంగళగిరి భగీరథ ఫ్యామిలీ రెస్టారెంట్ స్పోర్ట్స్ జోన్ లో వనసమారాధన సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న పలువురు ప్రముఖులు

ఉత్సాహంగా కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాల గిరిధర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. పాతూరు సోమిరెడ్డి బజారు శ్రీ కటారుమిట్ట గణపతి దేవాలయము శ్రీ గంగా పార్వతి సమేత భస్మేశ్వర స్వామివారి సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందజేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరులో ఆదివారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ హాజ రయ్యారు. నరేంద్ర మాట్లాడుతూ కార్తీక మాసంలో వన భోజనాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తీక వన భోజనాలు మనకు చాటిచెబుతున్నాయి అన్నారు. అనాదిగా వస్తున్న ఎన్నో పర్వ దినాలను మనం పాటిస్తున్నామని, ఇం దులో భాగంగానే వన సమారాధన కార్యక్రమం అని అన్నారు.



పొన్నూరులో నిర్వహించిన వనసమారాధనలో వడ్డిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి భగీరథ ఫ్యామిలీ రెస్టారెంట్ స్పోర్ట్స్ జోన్ లో గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పలువురు ప్రముఖులు మాట్లాడారు. సగరులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. నగరంలో సగరులకు స్థలం కేటాయించి సుమారు 70 లక్షల రూపాయలు నిధులు కేటాయించి సగర భగీరథ కమిటీ హాల్ నిర్మాణం చేయించి ఇచ్చిన ఎమ్మెల్యే ఆళ్ళ రామకష్ణారెడ్డి(ఆర్కే)కు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉన్న సగరులను గుర్తించి బీసీ(డీ)గా ఉన్న సగరులను బీసీ (ఏ)గా మార్చాలని వారు కోరారు. భవన నిర్మాణ రంగంలో సగరులు అధికంగా ఉన్నారని ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ సగరులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పందేటి సాంబశివరావు, జూట్రు ఏడుకొండలు, సంఘం నాయకులు నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, కటారి విష్ణుమూర్తి, గండికోట అచ్చయ్య, రాజారావు, కగ్గా శ్రీను, దుంపల సోములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ ఆటలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.



మంగళగిరిలో వనసమారాధనలో పాల్గొన్న మహిళలు

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం: టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రైతు సమస్యలు పట్టని వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో రైతులు, నిరుద్యోగులు, ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలో 28,29,30 వార్డులలో ఆదివారం 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో అందజేశారు. వైసిపి వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్రంలో మొన్నటి వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులలో ఎండిపోయిన పంటలు కానీ ఇటీవల మిచౌంగ్ తుఫాను నేపథ్యంలో వాటిల్లిన పంటల నష్టం పట్ల కానీ స్పష్టమైన హామీలను వైసిపి ప్రభుత్వ ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి,రాజధాని అమరావతి అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు టిడిపి ద్వారానే సాధ్యమన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేయాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సిపిఎం తాడేపల్లి రూరల్ కమిటీ సమావేశంలో పల్లె కృష్ణ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ పంట నష్టం అంచనా వేయడానికి అధికారులను వెంటనే రంగంలోకి దింపాలని కోరారు. వరితో పాటు అరటి, పసుపు, కంద, ఉల్లి, ఆకుకూరల పంటలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కల్లాల్లోనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బోనస్ కూడా జత చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్‌లో మురుగు నీరు కలవకుండా చూడాలన్నారు. పంపింగ్ స్కీమ్ నిర్వహణకు, పూడుకుపోయిన కాలువ బాగు చేయడానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజధానిలో ఇళ్లస్థలాల రాని వారికి వెంటనే ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అసైన్డ్, కొండ పోరంబోకు, చెరువు పోరంబోకు స్థలాలు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిర్రావూరులో పశువుల డాక్టర్‌ను నియమించాలని కోరారు. గ్రామాల్లో దళితులకు శ్మశాన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే శ్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కాజ వెంకటేశ్వరరావు, కొండపల్లి యశోధ, వడ్డేశ్వరం పున్నయ్య, బి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు



పాపారావుకు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి :అఖిల భారత ఎన్‌టిఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు పెనుమాక కు చెందిన పాలెపు రామారావు జన్మదిన వేడుకలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండి ఇబ్రహీం, బి.రామకృష్ణారావు, రైతు సంఘం నాయకులు అక్కినేని సుబ్రమణ్యం, కె.శివప్రసాదరావు, నరసింహారావు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు

పెదకాకానిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ :శివాలయం రోడ్డు న్యూ ఇండియన్ పబ్లిక్ స్కూల్ లో ఆదివారం డివిసి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని డివిసి హాస్పిటల్ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర ప్రారంభించారు. శిబిరంలో 450 మంది రోగులకు వైద్య సేవలు అందజేసి, మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు హాస్పటల్ మానేజింగ్ డైరక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. సేవే లక్ష్యం గా ప్రతీ వారం పరిసర ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీ వాణి, జనరల్ సర్జరీ డాక్టర్ ఆసిష్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ వినయ్, గైనకాలజి డాక్టర్ శృతి పాల్గొన్నారు. శిబిరాన్ని మెడికల్ డైరెక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ సందర్శించారు.

కోవిడ్ ఫైటర్ అజ్మతుల్లా కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కరోనా మహమ్మారి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమయంలో కన్న వారే దగ్గరికి రాని విపత్కర పరిస్థితులలో, కుల మతాలకతీతంగా దహన సంస్కారాలు నిర్వహించిన కోవిడ్ ఫైటర్స్ టీం సభ్యులలో ఒకరైన షేక్. అజ్మతుల్లా మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండి అశోక్ రెడ్డి పేర్కొన్నారు.గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ అసోసి యేషన్ సభ్యులు, బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం అజ్మతుల్లా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.76 వేల రూపాయలు ఆర్థిక సహకారం సహాయం అందజేశారు. కార్యక్రమంలో వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రాల శివశంకర్, సభ్యులు ఐకేవి ప్రసాద్, మిలటరీ యూసఫ్, సత్తార్, జిలాని, మన్సూర్, ముస్తఫా, పాల్గొన్నారు.

సేంద్రీయ కూరగాయలతో ఆరోగ్యం పదిలం

- హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ధర్మజ

ప్రజాశక్తి-గుంటూరు



మహిళా రైతుకు సర్టిఫికెట్ అందిస్తున్న ధర్మజ

ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి సేంద్రీయ సాగు విధానంలో పండించిన కూరగాయాలు తినటమే ఉత్తమమని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వి.ఎస్.ధర్మజ అన్నారు. సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై పుల్లడిగుంట వద్ద కొర్నెపాడులో రైతునేస్తం ఫౌండేషన్ చేపట్టిన మూడు రోజుల శిక్షణ ఆదివారం ముగిసింది. చివరి రోజు ధర్మజ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో దొరికే కూరగాయల్లో చాలా వరకు రసాయనాలు వేసి పండిరచినవే నని, కొన్ని రకాల కూరగాయలకు చీడపీడల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆ చీడపీడల నుండి పంటను రక్షించుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో విచక్షణారహితంగా రసాయనాలను పిచికారి చేయాల్సి ఉంటుందనానరు. అలాంటి రసాయనాల అవశేషాలు ఉన్న కూరగాయలను తినడం వలన ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. దీనికి సరైన పరిష్కారం సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిరచుకోవడమేనని అన్నారు. కార్యక్రమంలో తేనేటీగల పెంపకందారు చలపతిరావు, శబరినాథ్, ఏడుకొండలు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సేంద్రియ పద్ధతిలో జామ సాగు సమాచారాన్ని శబరీ విపులంగా వివరించారు. బహుళ అంచెల సాగు విధానం, జీవ వైవిధ్యం ప్రాముఖ్యతను ఏడుకొండలు తెలియజేశారు. మూడోరోజు శిక్షణలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ల పనితనాన్ని ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు చూపించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

మెల్లెంపూడిలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

మేక శ్రీనివాసరెడ్డి, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఎంటిఎంసి పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వైఎస్ఆర్సిపి గ్రామ నాయకులు మేక శ్రీనివాసరెడ్డి ఎంటిఎంసి అధికారులను కోరారు. ఆదివారం ఆయన ఇంటి పరిసర ప్రాంతాలలో దోమలు అధికంగా ఉన్నాయని, బ్లీచింగ్ పౌడర్ రోడ్లపై చల్లారు. ఇటీవల వర్షాల కారణంగా ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోయిందని, దోమలు కూడా అధికంగా ప్రబలుతున్న కూడా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన చెందారు. తక్షణమే ఎంటిఎంసీ అధికారులు గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, లేనిచో వ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. దోమల బారీ నుండి ప్రజలను వ్యాధుల బారిన పడకుండా కాపాడాలన్నారు.

అభివృద్ధిని దెబ్బతీస్తున్న అవినీతి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచమంతటా వివిధ రూపాల్లో తాండవిస్తున్న అవినీతి ఆర్థిక అభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని దెబ్బతీస్తుందని, సంస్థలపై నమ్మకాన్ని నీరు కారుస్తుందని వక్తలు పేర్కొన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా అవినీతిని రూపుమాపటంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అక్రమాలను నిర్మూలించాలంటే పటిష్టమైన అవినీతి నిరోధక విధానాలను చేపట్టాలన్నారు.వాటి అమలుకు సమర్థమైన సంస్థలను ఏర్పరచాలన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలు, ఎన్నికల వ్యయం విషయంలో పారదర్శకత ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వాధికారులు తమ విధి నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాధన వ్యయంలో పారదర్శకత, జవాబుదారీతనాలకు పెద్దపీట వేయాల న్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 2003లో అవినీతి వ్యతిరేక ఒప్పందాన్ని ఆమోదించిందని, దానిపై 190 సభ్య దేశాలు సంతకాలు చేయడంతో ప్రపంచంలో అవినీతి పోరాటాన్ని చట్టపరమైన విధిగా పరిగణించడం మొదలైందన్నారు. అవినీతి నిర్మూలనలో ప్రభుత్వాలు, వ్యక్తులు, సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో అవినీతి నిరోధక దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అవధానులహరి, బి.బసవగుప్తా, జి.భాస్కరరావు ప్రసంగించారు.

బాల్య మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మంగళగిరి



కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మరణించిన గోల్డ్ వర్కర్ కుటుంబానికి ఆయన బాల్యమిత్రులు ఆర్థిక సహాయం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి రత్నాల చెరువులోని గోలి రవికుమార్ అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శనివారం మరణించారు. అసలే పేద కుటుంబం కావడంతో ఆ కుటుంబానికి రవికుమార్ బాల్యమిత్రులు ఆదివారం రూ.45 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచి మిత్రుని కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. స్థానిక సీకే హైస్కూల్లో 1999-2000 టెన్త్ క్లాస్ బ్యాచ్‌కి చెందిన తాము తమకు తోచిన సహాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రవికుమార్ ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్, వేణు, అశోక్, శ్రీకాంత్, ఖాదర్ వలీ, రమేష్, సుబ్రహ్మణ్యం, నరేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పార్కు రోడ్డులోని ఇమ్మానుయేలు చర్చిలో పాస్టర్ బొంతపురి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు యస్ సుబ్రహ్మణ్యం, కె నాగార్జున వర్మ , యన్ విమలమ్మ , పి మరియమ్మ , కె అచల రాణి, బి ప్రశాంత్ , బి దేవ రాజు, యన్ దేవి, టి అనుపమ తదితరులు పాల్గొన్నారు.

50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి



మంగళగిరిలోని రామనాథం చిన కోటయ్య శివపార్వతమ్మ వద్ధుల సేవాశ్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు రామనాధం వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఆదివారం 103వ ఉచిత నేత్ర పరీక్ష శిబిరం జరిగింది. నేత్ర పరీక్ష చేయించుకొని కళ్ళజోళ్ళు అవసరం ఉన్న 50 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఆక్యుపంచర్ వైద్యులు ఎం శివకుమార్, పిరమిడ్ మాస్టర్ దీపాల సాంబశివరావు, ప్రానిక్ హీలింగ్ ప్రాక్టీషనర్ శంభునాథ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా కార్యదర్శి ముంజంపల్లి నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :పొన్నూరు పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం షాదీ ఖానా లో ఆదివారం పొన్నూరు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేవీ డే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ సంఘ అధ్యక్షులు కెప్టెన్ మస్తాన్ వలి, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ రఫీ, జి.రావు, సంక్షేమ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు మాసూమ్ ఆలీ తదితరులు పాల్గొని భారత నేవీ డే ప్రాధాన్యతను వివరించారు. అనంతరం భారత నేవీలో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు.

ఖాతాదారుల శ్రేయస్సే పరమావధి కావాలి

క్రేన్ గ్రూపు సంస్థల అధినేత జివిఎస్ఎల్ కాంతారావు

ప్రజాశక్తి-గుంటూరు



మీనాక్షి ట్రేడర్స్‌ను ప్రారంభిస్తున్న కాంతారావు

వ్యాపారాలు విస్తరించి, లాభాలు గడించాలంటే నిజాయితీ, నాణ్యతతో కూడిన ఉత్తమ సేవలు అందించడం ఒక్కటే మార్గమని క్రేన్ గ్రూపు సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్య లక్ష్మీకాంతా రావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేట, చిన్న మహాలక్ష్మమ్మ దేవాలయం వద్ద, ముప్పిరి శెట్టి వారి వీధిలో రామరాజ్ కాటన్ వారి నూతన ఉత్పత్తులు వివేగం జిల్లా డిస్ట్రిబ్యూటర్ మీనాక్షి ట్రేడర్స్‌ను స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమతతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు మద్దాలి గిరి, వైసిపి నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, వైభవ్ ఫ్యాషన్స్ కెవి.నాగేశ్వరరావు తదితరులు హాజరై శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటర్లు కోట నితీష్, అద్దెపల్లి రాము మాట్లాడుతూ దేశంలోనే నాణ్యమైన ఉత్పత్తులకు మారుపేరుగా ఉన్న రామరాజ్ కాటన్ దోతీస్, షర్ట్స్, బనియన్స్ జిల్లా డిస్ట్రిబ్యూటర్లుగా సేవలందిస్తున్నామని తెలియజేశారు.

పుస్తకం ఓ మంచి స్నేహితుడిలా పనిచేస్తుంది

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణ దేవరాయలు

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పుస్తకం చదివితే అది మనకి ఒక మంచి స్నేహితుడిలా పనిచేస్తుందని ఎన్నో విషయాలు తెలుస్తాయని నరసరావుపేట ఎంపి లావు శ్రీ కష్ణ దేవరాయలు పేర్కొన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో.. గుంటూరు ఏఎల్బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల 10వ తేది నుంచి 31వ తేది వరకు జరిగే 23వ పుస్తక మహోత్సవ కార్యక్రమం లో ఎంపీ కష్ణ దేవరాయలు పాల్గొని బుక్ హౌస్ ను ప్రారంభం చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రజలంతా ఫోన్ లకు అంకితం అవుతూ,, సోషల్ మీడియా ఎక్కువగా వాడుతున్న నేపథ్యంలో పుస్తకాల పఠనం తగ్గిందని అన్నారు. కానీ పుస్తకాలు ఎంతో ఉపయోగం కల్గిస్తాయని,, ఏళ్ల నాటి విషయాలు తెలుస్తాయని, ఏకాగ్రత్త పెరుగుతుందన్నారు. పిల్లలు పుస్తకాల పఠానం వైపు మరలేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. పుస్తకాలను ప్రజలకు చేరువ చేసేలా గత 23 ఏళ్లుగా ఈ పుస్తకాల సమూహాన్ని ఏర్పాటు చేయటం పట్ల.. విశాలాంధ్ర వారికి ఎంపి అభినందనలు తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరావు, జంగాల అజయ్ కుమార్, చెరుకుపల్లి సింగా, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు తరచూ చేయించుకోండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వైద్య శిబిరంలో చికిత్సలను పరిశీలిస్తున్న డేగల, నశీర్ అహ్మద్

ఆకస్మిక ఆరోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు ఎప్పటికప్పుడు కీలకమైన వైద్య పరీక్షలు తరచూ చేయించుకోవాలని నగర టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్ సూచించారు. స్థానిక సంగడిగుంటలో ఆదివారం ఆయన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, షుగర్, బీపీ, గైనిక్, ఆర్థో, సంబందించిన సమస్యలతో పాటు జనరల్ మెడిసిన్ సమస్యలతో బాధ పడుతున్నవారికి వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఉచితంగా ప్రతి ఒక్కరికి బీపీ, షఉగర్, ఈసీజీ, గుండె సంబంధిత పరీక్షలు, అన్ని రకాల వైద్య సేవలు,మందులు ఉచితంగా అందజేశామన్నారు. 360 మంది శిబిరానికి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అచంసెట్టి అన్వేష్,డాక్టర్ జ్యోత్స్నా ప్రియాంక, డాక్టర్ సురేష్, డాక్టర్ పవన్ కుమార్, తూర్పు నియోజకవర్గ ఇంచార్జి మహమ్మద్ నసీర్ అహ్మద్, హాసన్ బాషా, తాడివాక సుబ్బారావు,కొత్తూరి వెంకట్,యర్రగోపు నాగేశ్వరావు, క్రోసూరి సతీష్, నిశంకరరావు అమర్నాథ్, బీరం వెంకటేశ్వరరావు, సోము బాలయ్య, బీరం శ్రీనివాసరావు, నల్లమేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో అక్షరాస్యత పెంపుదలకు కృషి

- కస్తూర్బా విద్యాలయాల్లో వసతులపై దృష్టి
- ఆటలు, కెరీర్ గైడెన్స్, స్కౌట్,యోగాకు ప్రత్యేక శిక్షణ
- ప్రజాశక్తితో బాలికల అభివృద్ధి అధికారిణి దొండేటి రేవతి





ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

బాలికల్లో విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పల్నాడు జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి డి.రేవతి తెలిపారు. కస్తూరిభా విశ్వవిద్యాలయాల్లో మెరుగైన బోధన కోసం కృషి చేస్తున్నామని మౌలిక సదుపాయాలను కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె తెలిపారు. చదువుతోపాటు ఆటలు, కెరీర్ గైడెన్స్, స్కౌట్, తదితర ఒకేషనల్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్టు రేవతి తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

కస్తూరిభా విద్యాలయాలల్లో ప్రత్యేక చర్యలు?

విద్యార్థినులకు క్రమశిక్షణ, సామాజిక సేవ, స్వీయ రక్షణ, కళలు,యోగా, క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి పోటీలలో కస్తూర్బా విద్యార్థి ప్రతిభ చాటారు. ఈపూరు మండలం కేజీబీవీ విద్యార్థులు యోగాలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన బాలికల వసతి గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ హాజరు, ఉత్తీర్ణత శాతం పెంచడం, మౌలిక వసతులు కల్పనపై తనిఖీలు నిర్వహిస్తున్నాం.

కెజిబివిలు, మోడల్ స్కూల్సులో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

జిల్లాలో 24 కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు 5967 మంది విద్యనభ్యసిస్తున్నారు. అదేవిధంగా 14 మోడల్ స్కూల్సు ఉండగా 10 స్కూల్‌లలో బాలికల వసతి గృహాలలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు 960 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. మోడల్ స్కూల్‌లలో ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపులు బోధిస్తుండగా 9 కెజిబివి లలో బైపిసి, 7 కెజిబివి లలో ఎంపిసి,6 కెజిబివి లలో సీఈసీ, 1 కెజిబివిలో ఎన్.ఈ.సి, మరో కెజిబివిలో సి.ఎస్.ఈ గ్రూపులలో బోధన జరుగుతోంది.

బాలికల ప్రవేశాల ఎంపిక ఎలా చేస్తారు?

విద్య పరంగా ప్రత్యేక అర్హత లేదు. కుటుంబంలో తల్లి లేదా తండ్రిని కోల్పోయినా, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన విద్యార్థినిలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ఆ తర్వాత బడి బయట పిల్లలకు, డ్రాప్ ఔట్ పిల్లలకు 2వ ప్రాధాన్యత ఉంటుంది. పేద మధ్యతరగతి పిల్లలకు చివరి ప్రాధాన్యత ఉంటుంది. ప్రవేశాలకు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియ పూర్తిగా ఆన్లైన్‌లో ఎంపికలు జరుగుతాయి.

కెజిబివిలలో ఉపాధ్యాయుల కొరత ఉందా?

కెజిబిలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యాసంవత్సరం ఆరంభంలో 100 పోస్టులు ఖాళీలు ఉండగా సెప్టెంబర్ నాటికి 82 పోస్టులు భర్తీ చేయడం జరిగింది. మిగిలిన 18 పోస్టులు త్వరలో భర్తీ చేస్తాం.

ఆంగ్ల మాధ్యమం ప్రారంభించాక విద్యార్థుల సామర్థం పెరిగిందా?

ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టాక విద్యార్థినుల సామర్థ్యం కొంత మేర మెరుగుపడ్డప్పటికీ ఉత్తీర్ణత శాతం ప్రభుత్వ లక్ష్యం కంటే తక్కువుగానే ఉంది.ఉత్తీర్ణత శాతం మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నాం. ఆంగ్లమాంధ్యంలోనే బోధన చేస్తున్నాం. గత ఏడాది ఎస్.ఎస్.సి లో 55.25 శాతం, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది 48 శాతం, రెండవ ఏడాది ఇంటర్మీడియట్ 76 శాతం ఉత్తీర్ణత శాతం ఉంది. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధనకు పంచతంత్ర 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

సరిపడా తరగతి గదులు, మౌలిక వసతుల కొరత?

నాడు - నేడు ద్వారా అదనపు తరగతి గదులు, వసతి గదుల నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయి. 24 కెజిబివి లకు గాను 7 కెజిబివిలలో 100 శాతం పనులు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. మెనూ ప్రకారం భోజనం, శానిటరీ నాప్కిన్స్ అందజేస్తున్నాం. వసతి గృహాల సందర్శనలో నేరుగా బాలికలతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

పాఠశాలల్లో ప్రత్యేక కోర్సులు పవేశపెట్టారా?

ఒకేషనల్ కోర్సులు, కుట్లు, అల్లికలు, ఫుడ్ ప్రాసెసింగ్ అగ్రికల్చర్ తదితర అంశాలకు సంబంధించి ఆరు నుండి ఎనిమిదో తరగతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చి కోర్సు సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్నాం.

తెలుగు భాషను మరవద్దు... : జొన్నవిత్తుల

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-తాడేపల్లి



హేమంత్‌కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన నృత్య రూపకాలు



జొన్నవిత్తులతో ఉండవల్లికి చెందిన రామలింగేశ్వరావు



జెవివి నాయకులు నాగేశ్వరరావుకు మెమెంటో అందజేస్తున్న మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు



కార్తీక వన సమారాధన సందర్భంగా ఆదివారం అమరావతి కరకట్టపై గల ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ అమ్మలాంటి తెలుగు భాషను మరువద్దని సూచించారు. దేశానికి వారసత్వంగా వచ్చిన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీ భారతీయ భారతి స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి తదితర జానపద నృత్యాలు అలరించాయి. అలాగే జనవిజ్ఞాన వేదిక నాయకులు కాటూరి నాగేశ్వరరావు ప్రదర్శించిన ప్రదర్శనలు చిన్నారులతో పాటు పెద్దలను ఆలోచింపజేశాయి. దెయ్యాలు లేవని, మంత్రాలు తంత్రాలు లేవని వేదికపై ఆయన నిరూపణలతో సహా చేసి చూపించడంతో సభికులందరూ కరతాల ధ్వనులతో తమ సంతోషం వ్యక్తపరిచారు. పొడవాటి గుడ్డ నుండి స్టీలు రాడ్డును తెప్పించడం, ఎర్ర క్లాత్‌ను తెల్ల కర్చీపులో పెట్టి ఓపెన్ చేస్తే ఎర్ర క్లాతు కనిపించకపోవడం, చిన్న గ్లాసులో ఉన్న నీటిని పెద్ద గ్లాసులోకి నింపడం తదితర వాటిని అందరి కళ్ల ముందే చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలకు హస్సీ ఆట నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ లైఫ్ చైర్మన్ గోకరాజు, ప్రెసిడెంట్ వెలగపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎంఎల్ నరసరాజు, పూర్వ అధ్యక్షులు సంపర రాంబాబు, మాజీ ఎంపి పి.మధు, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, పి.విజయ, రాజు, ఐజాక్ నూటన్, సందీప్, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ప్రముఖ నటుడు జొన్నా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.